ప్రజాశక్తి

శుక్రవారం 1 ఆగస్టు 2025 5 శ్రీ సత్యసాయి





మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

ఎస్ఐఆర్‌తో ప్రజాస్వామ్యానికి ప్రమాదం

◆ దొడ్డిదారిన చేస్తున్న పౌరసత్వ చట్ట సవరణ నమోదును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి

◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ద్వారా బీహార్ రాష్ట్రంలో దొడ్డిదారిన చేపట్టిన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) దేశంలో ఎన్నికల పార్లమెంట్ ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకే ప్రమాదం అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్ తెలియజేశారు. బీహార్ రాష్ట్రంలో చేపడుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఎన్జీవో హోంలో సదస్సు నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాంభూపాల్, చంద్రశేఖర్ ముఖ్యఅతిథిలుగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాదం అవుతుందని తెలిపారు. పౌరుల ఓటు హక్కును ప్రశ్నించే నిబంధనలు ఇందులో ఉన్నాయన్నారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ వ్యవస్థ ఎన్నికల సంఘం అన్నారు. ఇందుకు భిన్నంగా కేంద్ర హోం శాఖ మంత్రి ఆదేశాలతో ఓటరు జాబితాలను మార్చేసి లక్షలాది మందికి ఓటు హక్కు నిరాకరించి బిజెపికి రాజకీయ లబ్ధి చేకూర్చాలన్న కుట్ర జరుగుతోందన్నారు. రెండు నెలల్లో ఎన్నికల జరగబోతున్న బీహార్‌లో ఈ ప్రత్యేక సునిసిత అంశాన్ని తీసుకుని ఆ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది బిజెపి, ఆర్ఎస్ఎస్ మతతత్వ ఎజెండా అమలులో కీలక పరిణామం అన్నారు. ఎస్ఐఆర్ బీహార్‌కు మాత్రమే పరిమితం కాదని, దేశమంతా అమలు చేస్తామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించడం దారుణం అన్నారు. గత నాలుగు సంవత్సరాల క్రితం దేశవ్యాప్తంగా ప్రజలు తిరస్కరించిన పౌరసత్వ చట్ట సవరణ(సీఏఏ) జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్‌సిఆర్) చట్టాలను ఎస్ఐఆర్ పేరుతో దొడ్డిదారిని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. ఇందుకు కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆయుధంగా చేసుకుని బిజెపి మతతత్వ అజెండాను అమలు చేస్తున్న ఎస్ఐఆర్ ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. బీహార్‌లో దాదాపు 30 లక్షల మంది వలస కార్మికులు ఓటర్ల జాబితాను తొలగించాలని నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని విదేశీయుల పేరుతో ఓట్లు తొలగించే కుట్ర సాగుతుందన్నారు. పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో నిష్పక్షపాతంగా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల సంఘం బాధ్యత అన్నారు. ఆ బాధ్యత నుంచి ఎన్నికల సంఘం తప్పుకునేలా ప్రవర్తించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వి.రామి రెడ్డి, లాయర్స్ అసోసియేషన్ నాయకులు సతీష్, ఎంఎం రాష్ట్ర అధ్యక్షులు మహబూబ్ బాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, వెంకటనారాయణ, ఇర్ఫాన్, వలీ, మసూద్ నగర కమిటీ సభ్యులు రాజు, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, రామాంజినమ్మ, లక్ష్మీనరసమ్మ, తిరుమలేష్, బిహెచ్.రాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్,



బీటలు వారిన గోడ

హిందూపురం పట్టణంలోని పళనినగర్ అర్బన్ హెల్త్ సెంటర్



నాడు నిర్మాణం.. నేడు పగుళ్లు..!

◆ పురంలో అర్బన్ హెల్త్ సెంటర్ల భవనాలు సురక్షితమేనా..?

◆ మూడేళ్లకే బీటలు వారిన గోడలు

◆ ఇంజినీర్ల చేతివాటం..

◆ నాణ్యతకు తిలోదకాలు..

◆ భయం భయంగా విధులు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

గత ప్రభుత్వం 'నాడు-నేడు' కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, ఆసుపత్రుల్లో ఆధునీకరణ పనులు చేయడంతో పాటు నూతన భవన నిర్మాణాలు చేపట్టింది. ఇందులో భాగంగా 'ఆయుష్మాన్ భారత్' కింద హిందూపురం పట్టణంలో 3 అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణాలు చేపట్టింది. ఒక్కో భవనానికి రూ. 80 నుంచి రూ. 90 లక్షలు ఖర్చు చేసింది. అయితే ఇంజినీర్లు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై భవన నిర్మాణంలో చేతివాటం చూపించారు. దీంతో కాంట్రాక్టర్లు పనులు నాసిరకంగా చేయడంతో మూడేళ్లు కూడా గడవకముందే ఆయా భవనాల గోడలు నెర్రెలు చీలాయి. ఏ క్షణంలో ఏ గోడ కూలుతుందో అనే భయంతో అందులో పని



భవనంపై కన్పిస్తున్న నెర్రెలు



గోడపై వచ్చిన పగుళ్లు

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లాలోని అతిపెద్ద పట్టణం హిందూపురం పురపాలక సంఘం. పట్టణంలో ప్రజల సౌకర్యార్థం లక్ష్మీపురం, బోయపేట, శ్రీనివాస్ నగర్, ముదిరెడ్డిపల్లి, పళనీనగర్ ప్రాంతాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో లక్ష్మీపురం, బోయపేటలో పాత భవనాలకు మరమ్మతులు చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో 2022 సంవత్సరంలో మిగిలిన మూడు ప్రాంతాల్లో ఒక్కో భవనానికి సుమారు రూ. 80 నుంచి 90 లక్షలు ఖర్చు చేసి నూతన భవన నిర్మాణాలు చేపట్టారు. ఈ భవనాలు ప్రారంభించిన ఏడాదికే పళనినగర్‌లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ గోడలు బీటలు వారాయి. ఆ సమయంలో ప్రజాశక్తి దినపత్రికలో ప్రత్యేక కథనంతో సమస్యను వెలుగులోకి తీసుకురావడంతో గోడలకు సిమెంటు పూసి అధికారులు చేతులు దులిపేసుకున్నారు. మరో ఏడాదికి మళ్లీ ఆ గోడలు బీటలు వారాయి. ఆ సమయంలోనే సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. నిబంధనల మేరకు పనులు పూర్తయిన తర్వాత ఇంజినీర్లు భవనాల నాణ్యతను పరిశీలన చేసి కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయాల్సి ఉంటుంది. అయితే సంబంధిత అధికారులు కనీస నిబంధనలను కూడా పాటించకుండా కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తి పడి నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయినా బిల్లులు మంజూరు చేశారు. దీంతో వందేళ్ల జీవితకాలం ఉండాల్సిన భవనాలు వంద నెలలు కూడా ఉండడం లేదు. నిర్మాణాలు పూర్తయిన ఏడాదికే కాంట్రాక్టర్ల డొల్లతనం బయట పడుతోంది. ప్రమాదవశాత్తూ అర్బన్ హెల్త్ సెంటర్లు కూలిపోతే వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు వైద్యం కోసం వచ్చిన రోగులు సైతం ప్రమాదం బారిన పడతారు. ప్రమాదాలు సంభవించక ముందే అధికారులు స్పందించి పట్టణంలో నిర్మాణం చేసిన 3 అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు భవన నిర్మాణంలో అవినీతికి పాల్పడిన కాంట్రాక్టర్‌పై కూడా చర్యలు తీసుకొని, ప్రజాధనాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది.

భయం భయంగా విధుల నిర్వహణ

పట్టణంలో నూతనంగా నిర్మాణం చేసిన అర్బన్ హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఏ క్షణంలో ఏ గోడ కూలిపోతుందో, పైకప్పు ఎప్పుడు కూలిపోతుందో అని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే భవనాల మరమ్మతులు చేయించాలని, అప్పటివరకు వేరే భవనంలోకి మార్చేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఎస్పీ వి.రత్నను నిలదీస్తున్న మహిళ

ఎస్పీపై తిరగబడిన మహిళలు

◆ గంజాయి బ్యాచ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

◆ ఎస్పీ ఎదుట వాస్మోల్ తాగబోయిన మహిళా సర్పంచి

◆ కేసును పక్కదోవ పట్టిస్తున్నారని పోలీసులపై ఆగ్రహం

◆ కాలసముద్రంలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం కాలసముద్రంలో జిల్లా ఎస్పీ వి.రత్నకు చేదు అనుభవం ఎదురైంది. గంజాయి మత్తులో తోటి పిల్లలను చితకబాదిన గంజాయి బ్యాచ్ ఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా నిందితులను శిక్షించకపోవడంతో గ్రామస్తులు, పిల్లల తల్లిదండ్రులు జిల్లా ఎస్పీ రత్న పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా నిందితులను అరెస్టు చేయకపోవడంపై జిల్లా ఎస్పీని గ్రామస్తులు మహిళలు అడ్డుకున్నారు. కదిరి రూరల్ మండలం కాలసముద్రం గ్రామంలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించగా ఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు, గ్రామస్తులు పోలీసుల తీరుపై ఎస్పీ ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలసముద్రం గ్రామంలో మూడు రోజుల క్రితం దళిత విద్యార్థులపై గంజాయి బ్యాచ్ దాడి చేసిన ఘటన చోటు చేసుకుందని, గంజాయి మత్తులో తమ పిల్లలను చెప్పులు కర్రలతో విచక్షణంగా దాడి చేశారని వాపోయారు. తమ పిల్లలపై దాడికి పాల్పడిన వారిని ఎందుకు శిక్షించలేదని ప్రశ్నించారు. ఒకానొక దశలో ఎస్పీపై మహిళలు తిరగబడ్డారు. ఎస్పీ ఎదుటే గ్రామ సర్పంచి లలితమ్మ వాస్మోల్ బాటిల్ తీసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా అక్కడే ఉన్న మహిళ ఎస్ఐ, పోలీసులు అడ్డుకున్నారు. సర్పంచి చేతిలో బాటిల్‌ను లాక్కున్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కొందరు మహిళలు ఎస్పీ కాళ్లు పట్టుకునేందుకు ప్రయత్నించారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామని ఎస్పీ హామీ ఇస్తూ అక్కడినుండి వెనుతిరిగారు.

అధిక వడ్డీ వ్యాపారులు అరెస్టు

◆ వివరాలు వెల్లడించిన ఎస్పీ ◆ అధిక వడ్డీ వసూలు చేస్తే చర్యలు తప్పవు :ఎస్పీ



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ వి.రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో సంచలనం రేపిన అధిక వడ్డీ వ్యాపారులపై పోలీసులు చర్యలు చేపట్టారు. వడ్డీ వ్యాపారులు ఓ కుటుంబంపై దాడి చేసి భయభ్రాంతులకు గురి చేసిన ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి గురువారం నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో ధర్మవరం ఇన్‌ఛార్జి డీఎస్పీ వి.నర్సింగప్పతో కలిసి ఎస్పీ వి.రత్న వివరాలను విలేకరులకు వెల్లడించారు. ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు రమణ అనే వ్యక్తి అదే పట్టణానికి చెందిన ఎరికల రాజాతో రూ.6 లక్షలు వడ్డీకి అప్పు తీసుకున్నాడు. వారానికి రూ.10ప్రకారం వడ్డీ రూపంలో రూ.15 లక్షల వరకు చెల్లించినట్లు బాధితుడు చెబుతున్నాడు. తన ఆర్థిక పరిస్థితి బాగా లేని కారణంగా అంత వడ్డీ ఇవ్వలేనని రమణ ఇటీవల డబ్బులిచ్చిన వ్యక్తికి చెప్పాడు. ఈ క్రమంలో గత నెల 23వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో ధర్మవరం పట్టణం, శాంతి నగర్‌లోని దేవరశెట్టి భారతి ఇంట్లోకి ఎరికిల రాజా అనుచరులు మండల మహేష్, ముద్దనగుల వినోద్ కుమార్, గుజ్జల హేమంత్ కుమార్, గుంజర గోవర్ధన్, జెర్రిపోతుల మనోహర్‌లు వెళ్లారు. డబ్బులు ఇవ్వాలని రమణను అడిగారు. ఇప్పటికే చాలా వడ్డీ కట్టానని తన పరిస్థితి సరిగా లేని కారణంగా ఇక అంత వడ్డీ కట్టలేనని అతను వారికి తెలిపాడు. డబ్బులు ఇవ్వాలిందే అంటూ అక్కడికి వెళ్లిన ఐదుగురూ రమణ, అతని భార్య, పిల్లలపై దాడి చేసి రూ.7వేలను బలవంతంగా వసూలు చేశారు. అనంతరం నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటనపై బాధితులు ధర్మవరం పోలీసు స్టేషన్‌లో మరుసటి రోజు ఫిర్యాదు చేశారు. అప్పటికే దాడి ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుల కోసం గాలించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ధర్మవరం ఇన్‌ఛార్జి డీఎస్పీ నర్సింగప్ప పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ బందాలు నిందితుల కోసం గాలించారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నిందితుల మొబైల్ ఫోన్ల ద్వారా వారున్న ప్రాంతాన్ని గుర్తించారు. అందులో భాగంగా గత నెల 30వ తేదీ నిందితులు మండల మహేష్, ముద్దనగుల వినోద్ కుమార్, గుజ్జల హేమంత్ కుమార్, గుంజర గోవర్ధన్, జెర్రిపోతుల మనోహర్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మొదటి నిందితుడు యర్రగుంట్ల రాజా అలియాస్ ఎరుకుల రాజా, ఎ7 గుజ్జల విజయ్‌లు పరారీలో ఉన్నారని వారి కోసం ప్రత్యేక బందాలు ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎరుకుల రాజాపై ధర్మవరం పోలీసు స్టేషన్‌లో పలు కేసులు నమోదు కాగా అతనిపై రౌడీషీట్ కొనసాగుతోందన్నారు. దాడికి పాల్పడిన నిందితులపై పీడీ యాక్ట్ అమలు చేసే ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. జిల్లాలో అధిక వడ్డీల పేరుతో ఎవరైనా బెదిరింపులకు దిగితే బాధితులు పోలీసులకు సమాచారం ఇస్తే నిందితులను కఠినంగా శిక్షిస్తామని ఎస్పీ తెలిపారు. అధిక వడ్డీదారుల సమాచారం ఇచ్చే పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. విలేకరుల సమావేశంలో ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ధర్మవరం టూ టౌన్ సిఐ రెడ్డప్ప, ఆర్ఐలు వలి, మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న శైలకుమారి

రాగి పంట సాగు విస్తీర్ణం పెంచండి

ప్రజాశక్తి-మడకశిర టౌన్

మండలంలో రాగి పంట సాగు విస్తీర్ణం పెంచాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు శైలకుమారి సూచించారు. వేరుశనగ విత్తు కోవడానికి ఇంకా వారం గడువు ఉందని తెలి పారు. స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో గురువారం రైతులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయగా శైలకుమారి, మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప హాజరయ్యారు. శైలకుమారి మాట్లాడుతూ విత్తనశుద్ధికి జీవన ఎరువులు వాడటం వల్ల 15శాతం ఎరువులను ఆదా చేసుకోవచ్చు అన్నారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల ను ఉపయోగించడం వల్ల భూసార పరిరక్షణతో పాటు ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. అన్ని పంటల్లో నానో యూరియా, నానో డిఎపి ఉపయోగించడం వల్ల నేల ఆరోగ్యంతో పాటు పెట్టుబడి తగ్గుతుందన్నారు. పంటల్లో వచ్చే తెగుళ్లు, చీడను గుర్తించడానికి ఎపిఎస్ఎస్ యాప్‌ను వినియోగించి రైతులే తెగుళ్లను నిర్ధారించి పురుగుమందులను పిచికారి చేసుకోవచ్చని తెలిపారు. రాగి పంటను ప్రభుత్వమే క్వింటా రూ. 4,900తో కొనుగోలు చేస్తుందన్నారు. కందులు సాగులో యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం వేరుశెనగ, రాగి, మొక్కజొన్న, కంది పంటలో పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ కౌసర్, మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ స్రవంతి, నాగలక్ష్మి, రవి, రైతులు పాల్గొన్నారు.

'స్మార్ట్ మీటర్స్ కాదు.. షాక్ మీటర్స్'

సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ

విద్యుత్ 'స్మార్ట్ మీటర్స్ కాదు.. షాక్ మీటర్స్' అని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. పట్టణం లోని గాంధీ సర్కిల్‌లో గురువారం సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ విద్యుత్ భారాలు తగిస్తామని, ప్రజలపై ఎలాంటి భారాలు మోపమని ఎన్నికల్లో హామీలు ఇచ్చిన కూటమి నాయకులు గెలిచిన తర్వాత వాటిని విస్మరించారన్నారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో వినియోగదారులపై 4 రకాలుగా రూ. 15,485 కోట్ల భారం మోపడం అన్యాయం అన్నారు. స్మార్ట్ మీటర్లు పగలకొట్టండి అని పిలుపునిచ్చిన నారా లోకేష్ నేడు స్మార్ట్ మీటర్లు బిగించాలని ఆదేశాలు ఇవ్వడం శోచనీయమన్నారు. స్మార్ట్ మీటర్ల ఒప్పందాలను రద్దు చేయకుండా కొనసాగించడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు బిగించిన అనంతరం షాపులు, చిన్న పరిశ్రమలు, సంస్థలకు రెండు, మూడు రెట్లు కొందరికైతే 10 రెట్లు విద్యుత్ బిల్లులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లులు ఆన్‌లైన్‌లో రావడం వల్ల జవాబుదారీతనం ఉండదని పాత మీటర్లు, పాత రీడింగ్ పద్ధతినే కొనసాగించాలన్నారు. అధిక విద్యుత్ వినియోగించే సమయంలో అధిక రేట్లు నిర్ణయించి వసూలు చేయడం వల్ల ప్రజలు మరింత ఆర్థిక దోపిడీకి గురవుతారని ధ్వజమెత్తారు. అదానీ స్మార్ట్ మీటర్లు, సోలార్ విద్యుత్ ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని, గృహాలకు మీటర్లు పెట్టవద్దని, సర్దుబాటు ఛార్జీలు పూర్తిగా రద్దు చేసి బిల్లులు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో నాయకులు హరి, నాగరాజు, బాబావలి, గంగాధర్, మహబూబ్‌బాషా, హబీబ్, వెంకటేశులు, రాజురావు, సూరి, నాగమ్మ, నరసమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

ప్రజాశక్తి-మడకశిర

ఉద్యోగంలో చేరిన ప్రతి వ్యక్తికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. మండలంలోని కె.గుండుమల జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి గురువారం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో పాఠశాలలో సన్మాన సభ నిర్వహించగా వారు ముఖ్యఅతిథు లుగా హాజరై కృష్ణమూర్తిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. తిప్పేసావమి ఉపాధ్యాయుడి సేవలను కొనియాడారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించారన్నారు. కార్యక్రమంలో సర్పంచి కరియన్న, మాజీ సర్పంచి చంద్రప్ప, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన ఎంఇఒ-1కు సన్మానం

ప్రజాశక్తి-రొద్దం



ఎంఇఒను అభినందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

మండల నూతన ఎంఇఒ-1గా గురువారం బి.అరవిందకుమార్ బాధ్యతలు చేపట్టారు. మడకశిరలో పని చేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ఎంఇఒను స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో యుటిఎఫ్, ఎపిటిఎఫ్ నాయకులు వేర్వేరుగా కలిసి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలపారు. నూతన ఎంఇఒను కలిసిన వారిలో ఎంఇఒ-2 జయభాస్కర్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జిసి.నరేష్‌కుమార్, మండల అధ్యక్షుడు ఎస్.గంగాధర్, ట్రెజరర్ ఎం.నరేష్, సభ్యులు ఆది జినేష్, జైన్, కాశీ, ఎపిటిఎఫ్ మండల అధ్యక్షుడు ఎన్.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, రాష్ట్ర కౌన్సిలర్ కె.మల్లికార్జున, పి.నరసింహుడు, ఎం.శ్రీనివాసులు, ఎం.గోకుల్, పిఎస్ హెచ్ఎం ఆదినారాయణ, తదితరు లు ఉన్నారు.



ఎంఇఒను అభినందిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

పురం రైల్వేస్టేషన్‌ను అధునాతనంగా తీర్చిదిద్దుతాం

జనరల్ మేనేజర్ ముకుల్ శరన్ మాథూర్



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిఎం ముకుల్ శరన్ మాథూర్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రైల్వే స్టేషన్ అమృత్ పథకం కింద ఎంపికైందనిఆ నిధులతో రైల్వే స్టేషన్ ను మాడ్రన్ స్టేషన్ గా తీర్చి దిద్దుతామని రైల్వే జనరల్ మేనేజర్ ముకుల్ శరన్ మాథూర్ పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన గురువారం బెంగళూరు డిఆర్ఎం అషి తోష్ కుమార్ సింగ్‌తో కలిసి పరిశీలించారు. స్టేషన్ లో ప్రయాణికులకు ఉండాల్సిన మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆర్ ఎం ఎస్ కార్యాలయం, ప్రయాణికుల వెయిటింగ్ హాల్, పాత గూడ్స్ రోడ్డు ఇతర విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాదాపు రూ. 15 కోట్ల తో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈసందర్భంగా పలువురు విలేకరులు యశ్వంతపూర్ లో ఆగాల్సిన సింధనూరు ఎక్స్ ప్రెస్ రైలు యశ్వంతపూర్ లో ప్లాట్ ఫామ్ లేకపోవడంతో హిందూపురంలో నిలుపుతున్నారని. దీనిని అనంతపురం వరకు పొడిగిస్తే ప్రయాణికులకు సౌకర్యకరంగా ఉంటుందని చెప్పారు. పుట్టపర్తి ప్యాసింజర్ రైలును అనంతపురం వరకు పొడిగించి ధర్మవరం ప్యాసింజర్ రైలును రద్దు చేశారు. రద్దు చేసిన ధర్మవరం ప్యాసింజర్ రైలు పుట్టపర్తి వరకు కొనసాగిస్తే ప్రయాణికులకు సౌకర్యకరంగా ఉంటుందని చెప్పారు. అనంతపురం ప్యాసింజర్ రైలులో ప్రయాణికులకు అవసరమైన మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు దీనిపై జనరల్ మేనేజర్ మాట్లాడుతూ పరిశీలన చేసి రద్దు చేసిన రైళ్లను కొనసాగించే విధంగా చూస్తామన్నారు. ఈ సందర్భంగా రైల్వే యూనియన్ నాయకులు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డిసిఎం నివేదిత, ఏ డి ఆర్ ఎం పరీక్షిత్ మోహన్, సీనియర్ డి ఈ ఎన్ రాజీవ్ శర్మ, సీనియర్ డిఓఎం ప్రియా, సీనియర్ డిఈఈ తోపాటు ఇతర అధికారులు స్థానిక రైల్వే శాఖ అధికారులు సోమప్ప, కిరణ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కారుణ్య నియామకాలు



నియామక పత్రాలు అందుకున్న కార్మికులతో చైర్మన్, కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుల కారుణ్య నియామకాలు పారదర్శకంగా నిర్వహించి నియామక ఉత్తర్వులు అందజేసినట్లు ఛైర్మన్ డిఈ రమేష్‌కుమార్, కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఎమ్మెల్యే బాలకృష్ణ సూచనల మేరకు మున్సిపల్ కార్యాలయంలో ఒప్పంద కార్మికులుగా పని చేస్తూ మరణించిన, ఉద్యోగ విరమణ పొందినవారి స్థానంలో విధులు నిర్వహించడానికి వారి కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం కల్పించే విషయంలో పారదర్శకంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి 17 మందికి నియామక ఉత్తర్వులు అందించేందుకు అనుమతులు రాగా ఈ మేరకు ఆయా అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను అందజేశామన్నారు. నియామక ఉత్తర్వులు అందజేయడం పట్ల ఉద్యోగాలు పొందిన వారు ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సతీష్, టిడిపి నాయకులు దుర్గానవీన్, సుమో శీన, హరీష్ కుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు హెల్త్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పురపాలక సంఘంలో ఆప్కాస్ విధానంలో విధులు నిర్వహిస్తు మతి చెందిన, రిటైర్డ్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ తరపున పారిశుధ్యకార్మికులు కొన్నేళ్లుగా ఆందోళనలు చేపట్టారు. సిఐటియు పోరాట ఫలితంగా మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్, కమిషనర్ మల్లికార్జున కార్మికులకు సంబంధించిన ఫైల్‌ను వేగవంతంగా కలెక్టర్ వారికి పంపి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో 14 మంది పారిశుధ్యకార్మికులకు, ఇంజనీరింగ్ విభాగంలో ఒకరికి అప్కాస్ విధానంలో ఉద్యోగంలోకి తీసుకుంటూ నియమకా పత్రాలు అందించారు. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ రాము, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి జగదీష్ ఆధ్వర్యంలో ఛైర్మన్, కమిషనర్‌లను కమిషనర్ ఛాంబర్ ముందు సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, కౌన్సిలర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కె సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

స్థానిక ఎన్జీవో హోంలో జిల్లా వనరుల కేంద్రంఆధ్వర్యంలో రైతు సేవ కేంద్ర సిబ్బందికి డివిజన్ స్థాయి శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి డిడిఎ రామునాయక్ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను ఈ పంట నమోదు చేయాలన్నారు. శాస్త్రవేత్త రామసుబ్బయ్య మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజను నందు సాగుచేసిన వేరుశనగ, కంది, ఆముదం పంటలకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు ధర్మవరం లక్ష్మానాయక్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం, ఈ పంట నమోదు గురించి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ధర్మవరం డివిజన్ వ్యవసాయ అధికారులు, ముస్తఫా,ఏఈఓలు, ఆర్ ఎస్ కె అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద బోరుబావి తవ్వకం

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల పరిధిలోని సంజీవపల్లి సమీపంలో గల అక్కమ్మ గుడి దగ్గర భక్తులకు నీటి సౌకర్యార్థ అదే గ్రామానికి చెందిన రాజేంద్ర నాయుడు గురువారం బోరుబావి తవ్వించాడు. అందులో నీరు పుష్కలంగా లభించాయి. దీంతో గ్రామస్తులు రాజేంద్ర నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన కుట్టు శిక్షణ

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని పెద్దరెడ్డిపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ప్రభుత్వం ప్రతి మండలానికి స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో కుట్టు శిక్షణ శిబిరాలను 90 రోజులపాటు నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ శిక్షణ పొందిన ప్రతి మహిళకు ఉచిత కుట్టు మిషన్ తో పాటు వ్యక్తిగత సర్టిఫికెట్లను త్వరలో అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువత నాయకులు ప్రవీణ్ రెడ్డి, మాజీ ఎంపీపీ డిఎన్ ఆదిశేష రెడ్డి, సోమప్ప, బాలాజీ, వెంకటేష్, ఆదిశేష రెడ్డి, జూలా రెడ్డి, జిఎస్ మంజునాథ్, శివకుమార్, హరికుమార్, మురళి, వినోద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఉద్యోగులు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వారి మన్ననలు పొందాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా గురువారం మునిసిపల్ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అయూబ్, ఎంఈ దస్తగిరి, డీఈఈ. వాణి, ఏఈలు జనార్ధన్, శంకర్, మేనేజర్ ఆనంద్ కుమార్, ఏఏవో శోభన్ రెడ్డి, జేఏవో మనోహర్, టిపిఎస్. చంద్రమ్మ, ఆర్ఓ విజయ భారతీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శంకర్, నిజాముద్దీన్, హెల్త్ అసిస్టెంట్ కేశవ, ఆర్ఓలు, సీనియర్ అసిస్టెంట్లు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఎంఇఒగా హనుమంతరెడ్డి

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు ఎంఇఒ - 1గా కె. హనుమంతు రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఎంఈఓ 2 సాల్మన్ రాజ్, ఉపాధ్యాయులు ఆయనకు స్వాగతం పలికారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాభిమానుల సహకారంతో చిలమత్తూరు మండలాన్ని విద్యాపరంగా ఉన్నత స్థాయికి తీసుకువస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు జెవివి అభినందన

ప్రజాశక్తి-హిందూపురం

బిఎస్ఎల్‌వి ఎఫ్ - 16 ద్వారా నిస్సాన్ అంతరిక్ష ప్రయోగం, 740 కిలోమీటర్ల దూరం ఉన్న సౌర కక్షలోనికి విజయవంతంగా ప్రయోగించడంపై ఇస్రో శాస్త్రవేత్తలను స్థానిక జనవిజ్ఞాన వేదిక అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, డాక్టర్ ఈటి రామమూర్తి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు ఉమ్మడిగా చేపట్టిన అత్యంత ఖరీదైన ప్రతిష్టాత్మకమైన మొట్టమొదటి ప్రాజెక్ట్ నిసార్ శాటిలైట్ అన్నారు. తద్వారా భూ ఉపరితలంలోని పర్యావరణ వ్యవస్థలను, ప్రకృతి వైపరీత్యాలను అత్యంత ఖచ్చితత్వంతో పరిశీలిస్తుందన్నారు. ఈ శాటిలైట్ 24 గంటల లోపు పరిశీలించి, ప్రతి 12 రోజులకు ఒకసారి డేటాను పంపుతుందన్నారు. ఇటువంటి ప్రతిష్టాత్మకమైన ప్రయోగం విజయవంతం చేసినందుకు ఇస్రో శాస్త్రవేత్తలకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయులకు వేతనాలివ్వండి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే వేతనాలు ఇవ్వాలని వైయస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు పీవీ రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఈ సమస్యను డీఈవో కిష్టప్ప దృష్టికి గురువారం తీసుకెళ్లారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు జూన్, జూలై నెలల వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ముదిగుబ్బ, కదిరి ట్రెజరీల కింద పిడి పోస్టులలో పిఇటిలుగా పనిచేస్తున్న వారికి వేతానలు అందే విధంగా ట్రెజరీ కార్యాలయాలకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా 10 తరగతి మూల్యాంకనానికి సంబంధించి వివిధ స్థాయిలలో పనిచేసిన వారికి పారితోషకం వెంటనే చెల్లించాలన్నారు. వీలైనంత త్వరగా వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డిఇఒ హామీ ఇచ్చారని నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులపై నిర్లక్ష్యం చూపితే చర్యలు

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

వృద్ధులపట్ల నిర్లక్ష్యం చూపిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్లో వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జేసీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ పై జిల్లాస్థాయి సిటిజన్ కమిటీకి అవగాహన కల్పించారు. వయావృద్ధులు నిర్లక్ష్యానికి, అగౌరవానికి గురవుతున్నారని అలాంటి వారి కోసమే ఈ చట్టం రూపొందించడం జరిగిందని అన్నారు. సీనియర్ న్యాయవాది జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు నల్లప్ప మాట్లాడుతూ తల్లిదండ్రుల, వయోవృద్ధుల పట్ల నిర్లక్ష్యం చూపితే 2007 చట్టం సెక్షన్ 24 ప్రకారం తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చిన ఆస్తిని తిరిగి తీసుకోవచ్చని అన్నారు. అంతేకాక నిర్లక్ష్యం చూపిన వారికి మూడు నెలలు జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా కూడా విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి, ధర్మవరం ఆర్డీవోలు సువర్ణ, మహేష్ విభిన్న ప్రతిభావంతుల హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లాల సహాయ సంచాలకులు అర్చన, డి ఆర్‌డిఎ పీడీ నరసయ్య, పోలీస్ సిబ్బంది సీనియర్ సిటిజన్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం.. మహిళా కార్మికులకు గాయాలు

సంఘటనకు యాజమాన్యం బాధ్యత వహించాలన్న కార్మిక సంఘాలు




ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మహిళలు

ప్రజాశక్తి - పరిగి

మండలంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కాలువపల్లి టెక్స్పోర్ట్స్ గార్మెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికులు తీవ్ర గాయాల పాలయ్యారు. పని ముగించుకుని తమ ఇంటికి వెళ్తున్న తరుణంలో పరస్పరం ఆటోలు ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. కాలువపల్లి టెక్స్పోర్ట్స్ గార్మెంట్స్, పరిగి ఇండియన్ గార్మెంట్స్ ఎక్స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ గార్మెంట్స్ కార్మికులు పని ముగించుకుని ఆటోలో వెళుతుండగా నయారా పెట్రోల్ బంక్ వద్ద పరస్పరం వీరు ప్రయాణిస్తున్న ఆటోలు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కర్ణాటక గౌడేటి గ్రామానికి చెందిన జయమ్మ, నాగమణి, నాగరత్న, ప్రమాదానికి గురయ్యారు. ఆటో డ్రైవర్లు బాలు, ఇండియన్ డిజైన్స్ మోద పంచాయతీ కోనాపురం కార్మికులు పరిగి గార్మెంట్స్ సుగుణ,ప్రసాద్, రామాంజినమ్మ తీవ్ర గాయాలు పాలవడంతో 108 ద్వారా క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై యాజమాన్యం స్పందించకపోవడం పట్ల కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్మికులకు సరైన బస్సు సౌకర్యం కూడా కల్పించకపోవడంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు పలువురు స్థానిక నాయకులతో పాటు ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నిసార్లు ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకున్నప్పటికీ యాజమాన్యం కనీస సౌకర్యాలు వారికి కల్పించలేకపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులతో పనిచేయించుకోవడమే తప్ప వారి కష్టాలను గార్మెంట్స్ యాజమాన్యం గుర్తించకపోవడం అందులోను కాలువపల్లి టెక్స్ టెక్స్ పోర్ట్ యాజమాన్యం కార్మికులకు కనీసం బస్సు సౌకర్యం కల్పించకపోవడం దారుణం అని మహిళా కార్మికులు వాపోయారు. కార్మిక శాఖ అధికారులు ఇలాంటి ఘటనలపై ఇప్పటికైనా స్పందించి కార్మికులకు అవసరమైన సదుపాయాలు కల్పించే విధంగా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పోలీసులు బాధ్యతతో పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి కదిరి టౌన్

కదిరిలో మూడో నిఘానేత్రం అందుబాటులోకి వచ్చిందని ప్రజల కోసం రక్షక భటులు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ సూచించారు. కదిరి పట్టణంలో నేరాల నియంత్రణకు అడ్డుకట్ట వేయడం కోసం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకుని ఇషా ఇన్ఫ్రాస్ట్రక్చర్ జికెఏంఎన్ కన్స్ట్రక్షన్ ఇతర దాతల సహకారంతో పట్టణ వ్యాప్తంగా 43 లక్షల రూపాయల విలువ చేసే 100 సి సి కెమెరాలను ఏర్పాటు చేశారు. గురువారం నిర్వహించిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ జిల్లా ఎస్పీ వి రత్న హాజరయ్యారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ కదిరి పట్టణ వ్యాప్తంగా చోరీలు, మహిళల అదృశ్యం, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు నిఘా వ్యవస్థను పటిష్ట చేసేందుకు సి సి కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజల కోసం రక్షక భటులుగా బాధ్యతగా పనిచేయాలని పోలీసులకు సూచించారు.గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తలుపుల మండలానికి హంద్రీనీవా నీటి జలాలు అందించామన్నారు. కదిరిలో ఆర్థిక స్థిరత్వం లేకపోవడం వలన అభివృద్ధి సాధ్యం కాలేదన్నారు.కదిరి పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు స్వలాభం తప్ప కదిరి అభివృద్ధికి ఆదాయం వచ్చేలా సహకరించలేదని అన్నారు. వ్యాపారులు పట్టణాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థను అమలు చేయాలని అది అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులుగా తమపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పార్థ సారథి, మున్సిపల్ చైర్ పర్సన్ దిల్షాద్ ఉన్నిషా, టీడీపీ నాయకులు పవన్ కుమార్ రెడ్డి, ఆర్డీవో వివిఎస్ శర్మ, డీఎస్పీ శివనారాయణ స్వామి, పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

బాలికల వసతిగృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన టైప్ ఫోర్ కస్తూరిబాయ్ బాలికల వసతిగృహాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం మండల పరిధిలోని కటారుపల్లి క్రాస్‌లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీ దేవరాజ్, డీడీ సంపూర్ణ, ఎంఇఒ కృష్ణనాయక్, తహశీల్దార్ బాబురావు, ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ సి కొండయ్య, ఎంపీపీ జి సోమశేఖర్ రెడ్డి, సర్పంచులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాపై వార్తరాస్తే కట్టేసి కొడతాం..!

విలేకరులకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల బెదిరింపు

పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్దకు వార్త సేకరణకు వెళ్లిన విలేకరుల పట్ల ఇరువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అసభ్యకర పదజాలంతో దూషించారు. తహశీల్దార్ కార్యాలయం పక్కనే ప్లాట్లు వేస్తున్న వారిని ఎంపీడీవో, తహశీల్దార్, డిప్యూటీ ఎంపీడీవో గురువారం పిలిపించారు. అక్కడికి చేరుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈటే నాగరాజు, కాంతా రానా కార్యాలయంలో ఉన్న విలేకరులపై అధికారుల ముందరే దుర్భాషలాడారు. 'మాపై వార్త రాస్తే చెట్టుకు కట్టేసి కొడతాం,మీ అంతు చూస్తాం' అంటూ వీరంగం సృష్టించారు. దీంతో తమపైకి దాడి చేయడానికి వచ్చిన రియల్ఎస్టేట్ వ్యాపారులపై మండల విలేకరులు స్థానిక ఎస్ఐ వలిబాషాకు ఫిర్యాదు చేశారు. విలేకరులపై దుర్భాషలాడిన ఇరువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

వాడీవేడిగా మున్సిపల్ మీట్

అధికారులపై కౌన్సిలర్ల ఆగ్రహం

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్ ఉన్నిషా అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం గురువారం నిర్వహించారు.ఈ సమావేశం వాడీవేడిగా కొనసాగింది. సమావేశంలో అజెండాలోని 1,2,3, అంశాలను తిరస్కరించి ఇతర అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు . ఈ సందర్భంగా 26వ వార్డు కౌన్సిలర్ ఏం ఎస్ ఫయాజ్ మాట్లాడుతూ మునిసిపాలిటీ వాహనాల డీజిల్ బిల్లులో ఒప్పంద కార్మికుల పెత్తనంతో రెండు కోట్ల రూపాయల కుంభకోణం జరిగిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అక్రమాలకు పాల్పడిన సిబ్బందిని ఆ బాధ్యత నుంచి తప్పించి మళ్లీ సచివాలయ ఉద్యోగికి డీజిల్ బిల్లుల బాధ్యత అప్పగించడం అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ డీజల్ బాధ్యతను మున్సిపల్ ఉద్యోగికి అప్పగించాలని కౌన్సిలర్లు చైర్పర్సన్‌ను కోరారు. ఈ విషయంపై చైర్ పర్సన్ స్పందించి మున్సిపల్ ఉద్యోగికి అప్పగిస్తామని కౌన్సిలర్లకు భరోసానిచ్చారు. అలాగే మున్సిపాలిటీకి సంబంధించిన ప్రభుత్వ అద్దె గదులపై ప్రత్యేక కమిటీ వేయాలని గత సమావేశంలో సభ్యులు అధికారులు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు అధికారులు వేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో ఏ వార్డులో చూసిన పారిశుధ్యం లోపించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అలాగే వార్డుల్లో కుక్కలు పందుల బెడద ఎక్కువైందని వీటిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కషి చేస్తామని ఇన్చార్జ్ కమిషనర్ సందీప్ తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిత్రావతి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి - తాడిమర్రి


మండల పరిధిలోని పెద్దకోట్ల పరివాహ ప్రాంతంలో నిర్మించిన చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి దిగువకు నీటిని గురువారం విడుదల చేశారు. కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశాల మేరకు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి రోజుకు 125 క్యూసెక్కులు చొప్పున ఒక గేటు ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతానికి వారం రోజులపాటు నీటిని దిగువకు విడుదల చేయాలని ఆదేశాలు ఇచ్చారని ఈ నీటి విడుదల ద్వారా మండలంలోని దాడి తోట తురక వారి పల్లి నాయన పల్లిలో తాగు, సాగునీటి సమస్య కొద్దిమేర తగ్గుతుందని అధికారులు తెలిపారు.



రిజర్వాయర్ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

పురం అభివృద్ధికి సహకరించండి

కేంద్ర మంత్రులకు ఎమ్మెల్యే బాలయ్య వినతులు



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ గురువారం ఢిల్లీలో పార్లమెంట్ ఆవరణంలో సైకిల్ ఎక్కి ఫోటోలకు ఫోజులు ఇచ్చి సందడి చేశారు. అనంతరం కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, హిందూపురం, అనంతపురం ఎంపీలు బికె పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణతో పాటు టిడిపి ఎంపీలతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం హిందూపురం నియోజకవర్గ అభివద్ధికి సంబంధించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కారిని కలిసి హిందూపురానికి రింగ్ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కేంద్ర కార్మిక ఉపాధి శాఖ యువజన వ్యవహారాల క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మనసుఖ్ మండవీయా ను కలిసి రాష్ట్రంలోని అతిపెద్ద పారిశ్రామిక వాడైన తూమకుంట పారిశ్రామిక వాడలో కార్మికుల సంక్షేమం కోసం, వారి ఆరోగ్యం కోసం 30 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని నిర్మాణం చేసేందుకు నిధులను మంజూరు చేయాలని కోరారు. అనంతరం గృహ నిర్మాణ, పట్టణాభివద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ ను కలిశారు. హిందూపురం పట్టణ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని, దీంతోపాటు భూగర్భ మురుగు కాలువ నిర్మాణం కోసం నిధులను కేటాయించాలని కోరుతూ దీనికి సంబంధించి వినతితో పాటు డి పి ఆర్ సైతం అందించారు. వీరితో పాటు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ను కలిసి హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన నిధులతో పాటు ఆరోగ్య పరికరాలను మంజూరు చేయాలని కోరారు. పెట్రోలియం మరియు గ్యాస్ వ్యవహారాల మంత్రి హరీదీప్ సింగ్ పూరి ను కలిసి వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ వెంట స్థానిక ఎంపీ తో పాటు టిడిపి ఎంపీలు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

మండలంలోని ఎర్రంపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం ఓ వ్యక్తి రైలు పట్టాలు దాటుతూ ప్రమాదవశాత్తూ రైలు కింద పడి మృతి చెందాడు. వివరాలు.. అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రం మండలంలోని పసులూరు కొత్తపల్లి గ్రామానికి చెందిన రామలింగారెడ్డి(63) ఎర్రంపల్లి గ్రామంలో బంధువుల దినాలకు వచ్చాడు. ఈ క్రమంలో రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలు కింద పడి మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే హిందూపురం రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని డి. చెర్లోపల్లి గ్రామ సమీపంలో గల సిద్దేశ్వర ఆలయంలో చోరీ జరిగింది. ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి అలంకరించిన 2తులాల బంగారు చైను, 2 తులాల బంగారు నల్లపూసలు దండ, 2 తులాల వెండి నాగపడగను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుడి పూజారి పవన్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాటజూదరులు అరెస్టు

ప్రజాశక్తి బత్తలపల్లి

పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసి ఇద్దర్ని అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారైనట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. మండలంలోని పత్యపురం గ్రామానికి చెందిన టి. కే నాయక్ పొలం లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలసి దాడులు చేశామన్నారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులులను పట్టుకొగా, మిగతా ముగ్గురు పారిపోయినట్లు తెలిపారు. పట్టుబడిన వారి నుండి రూ. 40, 820లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడిలో కానిస్టేబుళ్లలింగమయ్య, నాగార్జున, గోపాల్, ఆంజనేయులు, హోంగార్డ్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

చట్టంపై అవగాహన అవసరం : ఎస్పీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రతి ఒక్కరికి చట్టంపై అవగాహన అవసరమని వ్యక్తి సమాజంలో స్వేచ్ఛగా సమానత్వంతో జీవించే హక్కు భారత రాజ్యాంగం కల్పించిందని, అందరూ కలిసిమెలిసి సమానంగా ఉండాలని ఎస్పీ వి. రత్న ప్రజలకు సూచించారు. గురువారం కదిరి రూరల్ మండలం కాలసముద్రం జిల్లా పరిషత్ పాఠశాలలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ ప్రజల మధ్య అసమానతలు తొలగిపోయినప్పుడే సామాజిక వివక్ష తొలగిపోతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వపరంగా ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి అందుకు సమానంగా స్వేచ్ఛగా జీవించడానికి ప్రభుత్వం కల్పించిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివన్నారాయణ స్వామి, సిఐలు నిరంజన్ రెడ్డి, నాగేంద్ర, ఎస్ఐలు ఉపాధ్యాయులు, గ్రామస్తులు, మహిళలు విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

కొత్తచెరువు : అవగాహన లోపంతో విద్యార్థులు హక్కులు కోల్పోతున్నారని మానవ హక్కుల సంఘం నాయకులు భాస్కర్ నాయుడు తెలిపారు. కొత్తచెరువులోని శ్రీ చైతన్య పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న భాస్కర్‌నాయుడు విద్యార్థులు ఉన్నత వ్యక్తిత్వవికాసం ఎలాపొందాలి అన్న అంశంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల తమ హక్కులను కోల్పోతున్నారని, చేయాల్సిన పనులు చేయకపోవడం వల్ల స్వయంగా తామే నష్టపోతూ ,జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు తమ హక్కులు పొందాలంటే బాధ్యతగా ఉండడం ఆరోగ్యంగా ఉండడం ప్రకృతిని పరిరక్షించుకోవడం అవసరమన్నారు.కళాశాలలో బోధించిన పాఠాలను పూర్తిగా అన్వయించుకొని ఉత్తమ విద్యార్థిగా ప్రథమ స్థానంలో నిలిస్తేనే తన హక్కులను పొందినట్లు అవుతుందని చెప్పారు.

తనకల్లు :పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని కొర్తికోట గ్రామంలో గురువారం పౌర హక్కులు, విధుల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో రామానాయక్ మాట్లాడుతూ పౌరులు తమకు ఉన్న హక్కులు, విధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టానికి లోబడి ప్రతి ఒక్కరూ మెలగాలని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలను ప్రోత్సహించరాదని చెప్పారు. తహశీల్దార్ షాబుద్దీన్ పౌర హక్కులు, విధుల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు. ఎస్ఐ గోపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలందరూ హక్కులతో పాటు విధులను అనుసరించి జీవించాలని, కక్షలు, కార్పన్యాలకు, గొడవలకు, దూరంగా ఉండి తమకు సహకరించాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : పౌర హక్కుల పరిరక్షణకు మండల అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తహశీల్దార్ దేవేంద్ర నాయక్,డిప్యూటీ ఎంపీడీవో మాధవ రెడ్డి తెలిపారు. గురువారం పెడబల్లి ఎస్సీ కాలనీలో పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలు, మహిళల హక్కులకు భంగం కలిగినట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

మల్లికార్జునకు స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ కమిషనర్ గా పనిచేస్తున్న వి. మల్లికార్జునకు ప్రభుత్వం స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతికల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు గ్రేడ్ వన్ కమిషనర్ గా ఉన్న ఆయన ప్రస్తుతం సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా గుర్తింపు పొందిన హిందూపురంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గ్రేడ్ వన్ కమిషనర్ స్థాయి నుండి స్పెషల్ గ్రేడ్ స్థాయికి ప్రమోషన్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ తో పాటు పలువురు పాలకవర్గ సభ్యులు కమిషనర్ మల్లికార్జున ను సన్మానించి స్వీట్లు తినిపించారు. అదేవిధంగా వివిధ విభాగాలకు చెందిన మున్సిపల్ అధికారులు మల్లికార్జున కు శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ రాము, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి జగదీష్, అధ్యక్షులు మల్లిఖార్జున తదితరులు కమిషనర్‌ను కలిసి అభినందించారు.

యువతకు ఉపాధి కల్పిస్తాం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కేంద్ర ప్రభుత్వం సహకారంతో శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో పరిశ్రమల స్థాపించి యువతకు ఉపాధి కల్పిస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ పేర్కొన్నారు. నూతన రాష్ట్ర అధ్యక్షులుగా ఎంపికైన అనంతరం మాధవ్ రాయలసీమ పర్యటనలో భాగంగా సత్య సాయి జిల్లా కు గురువారం విచ్చేశారు. శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల పర్యటన నిర్వహిస్తున్నానని అందులో భాగంగా ప్రభుత్వం మరచిన సమస్యలను, నాయకులు కార్యకర్తల సమన్వయం. స్థానిక సమస్యలు గుర్తించడం కార్యవర్గ ఎంపిక తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నామన్నారు. ఐటీ రంగ పరంగా పుట్టపర్తిని అభివద్ధి చేస్తామని, ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిని, లేపాక్షి ,పెనుకొండ, గుత్తి తరహాలో టూరిజం డెవలప్మెంట్ చేస్తామని తెలిపారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లా మార్పు విషయంలో ఎలాంటి హామీలు ఇవ్వలేదని, ప్రజలు ఎలాంటి అపోహలు నమ్మవద్దని చెప్పారు. ఈ సమావేశంలో ఆదోని శాసనసభ్యులు పార్థసారథి, జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివ నారాయణ, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి , చంద్రమౌళి జిల్లా ఇన్చార్జి బాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.